క్లుప్తంగా

హాకీ అకాడమీలో శిక్షణకు విద్యార్థి ఎంపిక



వనపర్తి టౌన్: హాకీ అకాడమీ శిక్షణ కోసం ఈనెల 3, 4వ తేదీల్లో నిర్వహించిన పోటీలో బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి అనిల్‌కుమార్ ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ బి.కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు తారాబాయి, పీడీ కుమార్ హాకీ స్టిక్, బాల్‌ను అందజేసి అభినందించారు. హాకీలో నైపుణ్యం ప్రదర్శించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటేలా ఎదగాలని ఆకాంక్షించారు. తనదైన గేమ్ ప్లేతో చక్కటి ప్రదర్శన చూపించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, ఉపాధ్యాయులకు గొప్ప పేరు తీసుకురావాలని సూచించారు. అసోసియేషన్ సభ్యులు అనిల్‌కుమార్‌ను అభినందించారు.

ఉపాధ్యాయులకు సన్మానం



పాన్‌గల్: మండలంలోని శాగాపూర్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు కృష్ణవేణి, బాల్‌రాజు, రమేష్‌గౌడ్‌ను బుధవారం గ్రామస్తులు, ఉపాధ్యాయ, విద్యార్థుల ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు తిరుపతియాదవ్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీ, విరమణ తప్పనిసరి అని, విధుల్లో ఉన్న సమయంలో వారు చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచి పోతాయన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయుల సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకటస్వామి, ముంత సుబ్బయ్య, మల్లి, సురేష్, రాకేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలి



పాన్‌గల్: ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పక రావాలని మండల నోడల్ ఆఫీసర్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని బుసిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి సామర్థ్యాలను పెంచేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందేలా హెచ్ఎంలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. దీంతో పాటు ఉన్నత పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులకు సూచనలు అందించారు.

ఆర్థికసాయం అందజేత



వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన కొట్టం రవి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబానికి అతడి బాల్య మిత్రులు రూ.38 వేల ఆర్థికసాయాన్ని బుధ వారం అందజేశారు. మండల కేంద్రంలో 2003 సంవత్సరంలో 10వ తరగతి చదివిన మిత్రులందరూ కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. బాధిత కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉందని, ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు. రాబోయే రోజుల్లో 'స్నేహబంధం ఫౌండేషన్' పేరుతో బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేయాలని నిర్ణయించుకున్నట్లు వారు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఆత్మకూర్: అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్‌కు స్పందించకూడదని, ఓటీపీ తదితర వివరాలను ఇతరులకు ఇవ్వకూడదని ఎస్ఐ నరేందర్ అన్నారు. బుధవారం ఆత్మకూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. లాటరీ తగిలిందని, ఓటీపీ చెప్పమని, బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని, మీ పొటోలను మార్ఫింగ్ చేసి డబ్బులు ఇవ్వాలంటూ భయపెడతారని ఇలాంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు బీచుపల్లి, రోషన్న, సిబ్బంది యుగంధర్, బాలరాజు, స్థానికులు ఉన్నారు.



సమస్యల్లో ప్రభుత్వ పాఠశాలలు

- ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు 70 మంది
- విధుల్లో చేరేందుకు వచ్చిన వారు 48 మంది
- గతంలో ఉన్న ఖాళీలు 31



మూతపడ్డ వంటిమిట్టతండా పాఠశాల



పెంటకుప్పల మధ్య కొనసాగుతున్న వీపనగండ్ల హరిజన్‌వాడ స్కూల్

వీపనగండ్ల: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా.. పాలకులు, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయకపోవడంతో మారుమూల పల్లెల్లో కొనసాగుతున్న పాఠశాలల్లో వసతులు కొరవడుతున్నాయి. విద్యార్థులు పాఠశాలలకు వస్తున్నా చదువు చెప్పేందుకు ఉపాధ్యాయులు లేని పరిస్థితి మండలంలో గోచరిస్తుంది. క్షేత్రస్థాయి పరిశీలన చేసి ఉపాధ్యాయుల నియామకం, వసతులను మెరుగుపర్చాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు అంటిముట్టనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రైవేటు పాఠశాలలకు తమ పిల్లలను పంపించి రూ.వేలు ఖర్చు చేసుకుంటున్నామని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలో సరైన వసతులు కలిపించాలని కోరుతున్నారు.

బదిలీలతో కుదేలైన పాఠశాలలు

మండలంలో 8 ఉన్నత పాఠశాలలు, 3 అప్పర్ ప్రైమరీ స్కూల్, 16 ప్రాథమిక పాఠశాలలు ఉండగా.. 1,604 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇటీవల రాష్ట్రప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో మండలం నుంచి 70 మంది ఉపాధ్యాయులు బదిలీ కాగా కేవలం 48 మంది మాత్రమే ఇతర ప్రాంతాల నుంచి వచ్చారు. గతంలో 31 మంది ఉపాధ్యాయ ఖాళీలు ఉండగా పాత ఖాళీలే భర్తీ కాకపోగా.. తాజా బదిలీల్లో మండలంపై ఉపాధ్యాయులు ఆసక్తి చూపకపోవడంతో ఖాళీలు మరింత పెరిగాయి. దీంతో విద్యార్థులు చదువులకు ఆటంకం ఏర్పడుతుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

మూతపడే దశలో ఏకోపాధ్యాయ పాఠశాలలు

మండలంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు ఆరు ఉండగా.. అందులో మూడేళ్లుగా వంటిమిట్టతండా ఏకోపాధ్యాయ పాఠశాల మూతపడింది. అలాగే నాగర్లబండతండా, కొర్లకుంట, రంగవరం, మండల కేంద్రంలోని హరిజనవాడ, బీసీ కాలనీ స్కూల్‌లోనూ ఒకే ఉపాధ్యాయుడు ఉండడంతో సరైన విద్య అందడం లేదని చిన్నారుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలోని అన్ని పాఠశాలలో ఉపాధ్యాయులు చేరేవిధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వసతులు లేక..



తమ గ్రామంలో ఉన్న పాఠశాలలో సరైన వసతులు లేవన్న కారణం చేత పిల్లలు బడికి పోలే. దీంతో ఏళ్లుగా పాఠశాల మూతపడింది. అధికారులు స్పందించి వసతులు కల్పించి విద్యార్థుల తల్లిదండ్రులకు నచ్చచెప్పితే ప్రైవేట్ పాఠశాలలకు అయ్యే ఖర్చు మిగిలేది.

– వర్షానాయక్, వంటిమిట్టతండా

విద్యార్థులు నష్టపోతున్నారు



మండలంలోని పలు గ్రామాలకు బస్సు వసతులు లేవన్న కారణం చేత ఉపాధ్యాయులు విధుల్లో చేరేందుకు ఇష్టపడడం లేదు. పలు గ్రామాల్లోని పాఠశాలలో మౌలిక వసతులు కూడా లేవు. ఉన్నాతాధికారులు స్పందించి అన్ని పాఠశాలలకు అవసరమైన వసతులు కల్పించకుంటే సీపీఎం ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులను సమీకరించి ఆందోళనలు నిర్వహిస్తాం.

– బాల్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి

బదిలీ అయిన వారిని రిలీవ్ చేయలే

మండలంలోని పలు గ్రామాల పాఠశాలలో ఉపాధ్యాయుల బదిలీ అయినప్పటికీ ఉపాధ్యాయుల కొరత వల్ల రిలీవ్ చేయలేదు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం అన్ని గ్రామాల్లోని విద్యార్థులు నష్టపోకుండా పాఠశాలల్లో అవసరమైన వసతులను కల్పిస్తాం. త్వరలో భర్తీ కానున్న ఉపాధ్యాయ పోస్టుల్లో అధిక సంఖ్యలో మండలానికి వచ్చే విధంగా చూస్తాం.

– లక్ష్మణ్‌నాయక్, ఎంఈఓ, వీపనగండ్ల

అక్రమాలకు పాల్పడితే చర్యలు



అమరచింత: ఉచిత బియ్యాన్ని రేషన్ డీలర్లు అక్రమంగా ఇతరులకు విక్రయిస్తున్నారని, అలాంటి వారిపై దృష్టి సారించామని తహసీల్దార్ చాంద్ పాషా అన్నారు. ఆయన తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం పట్టణంలోని రేషన్ డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొంతమంది రేషన్ డీలర్లు లబ్ధిదారులకు నేరుగా డబ్బులు అందించి వారికి ఇవ్వాల్సిన బియ్యాన్ని కొంటున్నారని, అంతేకాకుండా రేషన్ షాపు నుంచి వాటిని బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. లబ్ధిదారుల నుంచి కిలో రూ.10 చొప్పున బియ్యాన్ని రేషన్ డీలర్లే కొనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా రేషన్ బియ్యం దందా నడిపే వారికి చివరి హెచ్చరిక చేస్తున్నానని, ఇకపై ఇలాంటి ఘటనలు తన దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఆర్ఐ వెంకటయ్య, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత



పెద్దమందడిలో మొక్కలు నాటుతున్న కొత్తకోట సీఐ రాంబాబు, ఎస్ఐ శివకుమార్

కొత్తకోట రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంలో భాగంగా మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కొత్తకోట సీఐ రాంబాబు అన్నారు. 'వన మహోత్సవం' కార్యక్రమంలో భాగంగా బుధవారం పెద్దమందడి పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రభుత్వ కళాశాల లెక్చరర్లు, విద్యార్థులతో కలిసి సీఐ రాంబాబు వివిధ రకాల మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మానవాళి మనుగడ మొక్కలతోనే ముడిపడి ఉందన్నారు. భవిష్యత్ తరాన్ని కాపాడుకునేందుకు, పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు తప్పనిసరిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. నాటిన ప్రతి మొక్కను పరిరక్షించినప్పుడే భావితరాలకు కాలుష్య రహిత సమాజాన్ని అందించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శివకుమార్, కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్ల బృందం, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



ఖిల్లాఘనపురంలో..

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం

ఖిల్లాఘనపురం: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్ఐ శ్రీహరి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా బుధవారం పోలీస్‌స్టేషన్‌లో గ్రామస్తులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాల బాగుకోసం మనం మొక్కలు నాటాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటడం వలన సమాజం బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ క్యామ రాజు, జన్ను మధు, బొట్టు శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు అవసరం

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని కేపీఎస్ స్కూల్‌లో బుధవారం వివిధ పదవులకు ఎన్నికలు నిర్వహించారు. హెడ్ బాయ్‌గా, హెడ్ గర్ల్‌గా ఎన్నికైన విద్యార్థులకు బ్యాడ్జీలు అందజేసినట్లు డైరెక్టర్ చంద్రహాసన్‌రెడ్డి అన్నారు. అదేవిధంగా ఆరెంజ్, రెడ్, బ్లూ, గ్రీన్, శ్రమశిక్షణ, స్పోర్ట్స్ ఇన్‌చార్జీలకు కెప్టెన్, వైస్ కెప్టెన్‌లకు బ్యాడ్జీలు ఇచ్చి అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థి దశ నుంచే కష్టపడి చదువుకుంటే ఉన్న లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉండాలని సూచించారు. రోడ్లపై జరిగే ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఎవరికైనా ప్రమాదాలు ఎదురైనప్పుడు 100కు, సైబర్ నేరాలకు 1930ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ డాక్టర్ ఎద్దుల రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు నివాళి

వనపర్తి టౌన్: ఉపాధ్యాయుడిగా, కవిగా ఎదిగిన గుర్రం జాషువా సేవలు మరువలేనివని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో గుర్రం జాషువా 53వ వర్ధంతిని టీజేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, నరసింహశర్మ, బాలస్వామినాయుడు, బాలేమియా, నరసింహ, నాగరాజు, రాధాకృష్ణ, రంగస్వామి, వెంకటేష్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న చెన్నకేశవులు

వనపర్తి టౌన్: వర్గీకరణ పోరాటం చివరి దశకు వచ్చిందని, ఆగస్టు చివరి వరకు సుప్రీం కోర్టు తీర్పు చెప్పనుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు అన్నారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని దాచలక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో కమిటీలను ఏర్పాటు చేసి, జెండాను ఆవిష్కరించాలన్నారు. దివ్యాంగుల పెన్షన్ల పెంపు కోసం వీహెచ్‌పీఎస్‌లు చేసే పోరాటంలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ లక్ష్మణ్, గంధం గట్టయ్య, నాగరాజు, మాసన్న, శ్యామ్, శ్రీను, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రామకృష్ణ, పరశురాముడు, గంధం లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సాగుతో అధిక లాభాలు



సాగుపై రైతులకు సూచనలు ఇస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: కూరగాయల పంటలు సాగుచేస్తే రైతులు ఎంతో లాభపడుతారని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి శివారులో నాగిరెడ్డి అనే రైతు ఆధునిక వ్యవసాయ పద్ధతిలో సాగుచేసిన టమాట తోటను మాజీ మంత్రి పరిశీలించారు. ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయం చేస్తే రైతుకు అధిక దిగుబడులు రావడంతో పాటు లాభాలు వస్తాయన్నారు. సేంద్రియ పద్ధతిలో కూరగాయల పంటలు సాగు చేసి సమాజంలో ఆరోగ్య అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అక్కడి నుంచి గ్రామానికి చేరుకుని హజ్ యాత్రకు వెళ్తున్న ఎండీ హన్నాన్, నూర్జహాన్‌బేగం, షహనాజ్‌బేగం ను నిరంజన్‌రెడ్డి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, రాజప్రకాష్‌రెడ్డి, సురేష్‌కుమార్, నాగేంద్రయాదవ్, గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని చిమనగుంటపల్లి, అంకూర్ గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న హైలెవల్ బ్రిడ్జి పనులను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత సాగునీటి సరఫరా, గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేశామని తెలిపారు. ప్రధాన రోడ్లపై నిర్మాణంలో ఉన్న హైలెవల్ బ్రిడ్జిలను వేగంగా పూర్తి చేసి వర్షాకాలంలో రవాణాకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బాలీశ్వర్‌రెడ్డి, పురేందర్, చిట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

మహిళ హక్కుల సాధనకు ఉద్యమించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సాయిలీల

పాన్‌గల్: మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కుల సాధన కోసం ఉద్యమించాలని ఐద్వా మహిళ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సాయిలీల అన్నారు. బుధవారం మండలంలోని తెల్లరాళ్లపల్లి, తెల్లరాళ్లపల్లితండాల్లో నిర్వహించిన మహిళ సంఘాల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల హక్కులను కాలరాస్తున్నాయని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై వచ్చే నెలలో జిల్లా కేంద్రంలో ఐద్వా మహాసభలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ మహాసభలో సమస్యలపై చర్చించి దశల వారీగా పోరాటాలు కొనసాగిస్తామన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో సంఘం నాయకురాలు చిట్టెమ్మ, అనిత, లక్ష్మి, భారతి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమం ఆగదు

అమరచింత: అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలు ఆపలేరని పీడీఎస్‌యూ నాయకులు అన్నారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌ను బుధవారం స్థానిక పోలీసులు అరెస్టు చేసి సొంత పూచికత్తుపై వదిలిపెట్టారు. ఈమేరకు వెంకటేష్ మాట్లాడుతూ విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేయడంతో ప్రభుత్వం విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టులు చేయడం తగదన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం నియంతల వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. విద్యాశాఖకు ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని నియమించలేకపోవడం వింతగా ఉందన్నారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని సమస్యల పరిష్కారం కోసం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. ప్రభుత్వాలు నియంతృత్వ పోకడలు వీడాలన్నారు.

ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం



ఖిల్లాఘనపురం: కేంద్ర బడ్జెట్‌లో రైతులు, యువత, మహిళలు, గ్రామీణాభివృద్ధి, గృహనిర్మాణం, దేశరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడు, జిల్లా ఎస్టీమోర్చ జిల్లా అధ్యక్షుడు రవినాయక్, మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ దేశానికి వెన్నుముక రైతు అన్నారు. అలాంటి రైతాంగానికి మోదీ అండగా నిలబడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో దశరథం, గోపాల్‌రెడ్డి, తులసీకుమార్, బండారి రాములు, చెన్నప్ప, పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అన్నదాతకు రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మదనాపురం: రాష్ట్రంలోని ప్రతి అన్నదాతకు రుణ మాఫీ చేయాలని చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు వంగూరు రామకృష్ణారెడ్డి అధ్యక్షతన పార్టీ కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా నాయకుడు రేచింతల శ్రీను మాట్లాడుతూ వ్యవసాయ నిర్మాణం, స్థానిక సంస్థల ప్రాధాన్యత, మండల కేంద్రంలో జూనియర్ కాలేజీ ఏర్పాటు, కూరగాయల సంత బజార్ స్థలం ఏర్పాటు, బస్టాండ్ నిర్మాణం, చెన్నై ఎగ్మోర్, బెంగళూరు రైలు స్థానిక రైల్వేస్టేషన్‌లో నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. అన్ని గ్రామాలకు బస్ సౌకర్యం కల్పిస్తూ రైతువేదికలను గ్రామపంచాయతీలో విలీనం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు జరిపి, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను గ్రామాల అభివృద్ధికి ఉపయోగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కొండ వెంకటేశ్వర్లుశెట్టి, జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, బాబుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల చెట్ల తొలిగింపు



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో బుధవారం కంపచెట్లను తొలిగించి ఆ ప్రాంతాన్ని శుభ్రపర్చారు. ఎస్సీ కాలనీలో కంపచెట్లు విపరీతంగా పెరిగి అపరిశుభ్రంగా మారడంతో వర్షాలకు కాలనీలో దుర్వాసన రావడంతో పాటుగా ఇళ్లలోకి పాములు వస్తున్నట్లు కాలనీవాసులు చెబుతున్నారు. గ్రామానికి చెందిన ఆగారం ప్రకాష్ విషయాన్ని తెలుసుకుని జేసీబీ సహాయంతో కాలనీలో కంపచెట్లను తొలిగించారు. కాలనీవాలసులు అనారోగ్యం పాలు కాకుండా ఉండేందుకు కంపచెట్లను తొలిగించడం జరిగిందన్నారు. కాలనీవాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రకాష్, రవి, రాజు, శరవంద పాల్గొన్నారు.

బాలకార్మికుడితో పనిచేయించిన యజమానిపై కేసునమోదు

గోపాల్‌పేట: బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హరి ప్రసాద్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని ఏదులలో ముస్కాన్ టీం గస్తీ చేస్తుండగా ఓ బాలకార్మికుడు ప్రధాన రహదారిపై ఉన్న ఆంజనేయ బైక్‌పాయింట్‌లో పనిచేస్తూ కనిపించాడు. వివరాలు ఆరా తీయగా బైక్‌మెకానిక్ ఓనర్ జాని అని తెలిసింది. బాలకార్మికుడితో పనులు చేయించినందుకు గాను బాలకార్మిక చట్టం ప్రకారం జిల్లా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గోపాల్‌పేట ఎస్ఐ హరి ప్రసాద్ వివరించారు.

రైతుబీమాకు దరఖాస్తుల ఆహ్వానం

పాన్‌గల్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతుబీమాకు నూతన పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు ఈనెల 28వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని ఏఓ సాజీద్‌రహామాన్ మండల రైతులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏఈఓలు అందుబాటులో ఉండి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల లోపు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునే రైతులు పట్టాదారు పాసుపుస్తకంతో పాటు నామినీ ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్స్ తీసుకరావాలని సూచించారు.

బడ్జెట్ కేటాయింపులో తెలంగాణకు అన్యాయం

పెబ్బేరు రూరల్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు నిధుల కేటాయింపులో వివక్షకు నిరసనగా సీపీఐ వనపర్తి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పాన్‌గల్ రోడ్డులోని అంబేడ్కర్ చౌరస్తాలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ మాట్లాడుతూ నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ పదవులకు రాజీనామా చేయాలని, బడ్జెట్‌ను సవరించి, విభజన హామీల అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీహరి, రమేష్, చంద్రయ్య, కళావతమ్మ, ఎత్తం మహేష్, కురుమయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

ఆత్మకూర్: పట్టణంలోని ముస్లింల ఖబ్రస్తాన్ (శ్మశానవాటిక)లో సమాధుల ధ్వంసం చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ముస్లిం సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ రాజు, కమిషనర్ నాగరాజులకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు గయాసుద్దీన్, షాహీద్, ఇమ్రాన్, వాహేద్, ఉస్మాన్, నిరంజన్, ఫేరోజ్, యువకులు ఉన్నారు.

మహిళకు అరుదైన శస్త్రచికిత్స

వనపర్తి: రెక్కాడితేగానీ డొక్కాడని దినసరి కూలి పని చేసుకుని జీవించే మహిళకు అరుదైన శస్త్ర చికిత్స చేసి ప్రాణాపాయం నుంచి కాపాడినట్లు వెల్‌నెస్ ఆస్పత్రి మార్కెటింగ్ విభాగం వైస్ ప్రెసిడెంట్ అశోక్‌కుమార్ చెప్పారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంవైఎస్ ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన శస్త్రచికిత్స చేసిన డాక్టర్ కార్తీక్, వైద్యం చేయించుకున్న మహిళా కుటుంబ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆరు నెలల క్రితం వనపర్తి పట్టణానికి చెందిన మహిళకు తరుచూ కడుపునొప్పి, జ్వరం వస్తుందనే ఇబ్బందితో పలు ఆస్పత్రులు తిరిగి చివరకు స్థానిక వెల్‌నెస్ ఆస్పత్రికి వచ్చారరు. తమ ఆస్పత్రి వైద్యులు ఆమె సమస్యను వైద్య పరీక్షలతో గుర్తించి కడుపులోని పేగుకు రంధ్రం పడినట్లు గుర్తించి రెండు నెలల వ్యవధిలో రెండుసార్లు శస్త్రచికిత్స చేసి సాధారణ స్థితికి తీసుకొచ్చినట్లు తెలిపారు. మరిన్నీ వైద్యసేవలను గ్రామీణ ప్రాంతాలకు సైతం వెల్‌నెస్ ఆస్పత్రి యాజమాన్యం తీసుకొస్తున్నట్లు ఆయన తెలిపారు.

కేటీఆర్ జన్మదిన వేడుకలు

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్ర మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు జన్మదినం వేడుకలను పురస్కరించుకొని బీఆర్ఎస్ నాయకులు బుధవారం జిల్లావ్యాప్తంగా సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం అనాథ, వృద్ధాశ్రమాలు, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పురపాలక మంత్రిగా పనిచేసిన కేటీఆర్ అన్ని మున్సిపాలిటీల్లో అభివృద్ధికి నిధులు మంజూరు చేసి సహకరించారని కొనియాడారు.